క్లుప్తంగా

సెయింట్ జోసెఫ్‌లో 'పితృదేవోభవ' వేడుకలు



వక్తృత్వ పోటీలో మాట్లాడుతున్న విద్యార్థిని. చిత్రంలో హిందీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో శనివారం ప్రపంచ పితృది నోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ విభాగం ఆధ్వర్యంలో 'పితృదేవోభవ' వేడుకలు ఘనంగా నిర్వహించారు. తండ్రి గొప్పదనం, అమ్మాయిల జీవితంలో తండ్రి పాత్ర, సమాజంలో తండ్రి ప్రాధాన్యత, ఆదర్శప్రాయులైన తండ్రులు అనే అంశాలపై వక్తృత్వం, వ్యాసరచన, గీతాలాపన, కవితల పోటీ నిర్వహించినట్లు హిందీ విభాగాధిపతి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు తమ తండ్రే తమ హీరోగా అభివర్ణిస్తూ ప్రసంగాలు చేశారు. నేటితరం తండ్రులు తమ కుమార్తెలను అన్ని రంగాల్లో ముందుండేలా ప్రోత్సహిస్తున్నారని, వివాహం కంటే విద్యకే పెద్ద పీట వేస్తున్నారని అమ్మాయిలు అభిప్రాయపడ్డారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ వేడుకలను ప్రారంభించారు. హేమ, నందిని, లిఖిత, గాయత్రి, ఖుషి విజేతలుగా నిలిచారని, వీరికి సోమవారం బహుమతులు ప్రదానం చేస్తామని తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

దాబాగార్డెన్స్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య 615వ జయంతిని పురస్కరించుకుని బీచ్‌రోడ్డు అన్నమయ్య విగ్రహ ప్రాంగణం వద్ద అన్నమయ్య పద నర్తనం పేరిట నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా శనివారం నగరానికి చెందిన నాట్య దీపిక కూచిపూడి అకాడమీ పిల్లలు చేపట్టిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అకాడమీ వ్యవస్థాపకురాలు ఎల్. ఇంద్రాణి నరేంద్ర నేతృత్వంలో చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేపట్టారు.

సచి(సే)వాలయం

- పాలనలో కొత్త ఒరవడి.. సంక్షేమానికి వారధి
- అందుబాటులో 546 సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

'కాంతం వదినా.. మా వాడు పది పాసయ్యాడే.. ఆడికి అదేదో క్యాస్ట్ సట్టిపికెట్ అంట కావాలంటుండు.. ఎక్కడ తేవాలో తెనీదు.. సుబ్బలచ్చిమిని బోగట్టు సేత్తే మండలాపీసుకి పొమ్మంటుంది.. ఎలా ఎల్లాలో తెలీట్లేదే.. నీకు తెలిత్తే సెప్పవే..'

'ఓసి ఎర్రిదానా ఏ కాలంల ఉన్నావే.. అదెప్పుడో మారిపోనాదే.. జగన్ బాబు ఎక్కినప్పటి నుంచి మన పక్కీదులోని సచివాలయం అని పెట్టారు గందా.. ఆడనే మనకి అవసరమైన సటిపికెట్లు అన్నీ ఇత్తన్నారు. అదేనే కులం, ఆదాయం, రేసనీకార్డులు, పింఛినీలు ఇలా మనకేటి అవసరమైతే అవన్నీ ఇత్తారు.. ఆపీసులంట తిరిగే రోజులు ఎప్పుడో పోనాయే వెంకటనచ్చిమీ.. ఆడికి పోతే ఆడనే అందరూ ఉంటారు. ఆధార్ కార్డు పట్టుకుపోతే ఆల్లే అన్నీ సేత్తారు.. పో బేగెల్లి ఆ పనేటో సూడే..'



కుమ్మరవీధి సచివాలయం

అల్లిపురం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జనం ఇబ్బందులు గుర్తించి పాలనా వ్యవస్థలో తీసుకొచ్చిన సరికొత్త విప్లవం సచివాలయ వ్యవస్థ. ప్రజల ముంగిటికే సేవలను తరలించాలన్న లక్ష్యంతో అన్నింటినీ సచివాలయాల ద్వారా ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చారు. అటువంటి సచివాలయాల గురించి ప్రజలంతా అదే సర్వం.. అదే సకలం అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఏ ధ్రువ పత్రం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వలంటీర్ వ్యవస్థతో ప్రజల గడపలోకి సేవలు అందుబాటులోకి తీసుకురావటంతో పరిపాలన కొత్తబాట పట్టింది. గతంలో అవ్వాతాతలు తమ పింఛన్ల కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసేవారు. అప్పుడప్పుడు క్యూలైన్లలోనే ముఖం తిరిగి పడిపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటనలు గత ప్రభుత్వంలో కోకొల్లలు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ప్రతి నెల 1వ తేదీ తెల్లవారక ముందే వలంటీర్లు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి పింఛన్ అందజేస్తున్నారు. గతంలో అందుతుందో.. అందదో తెలియని పింఛన్ ఇప్పుడు ఏకంగా ఎగిరొచ్చి ఒళ్లో పడుతుందని పింఛన్‌దారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పథకం వలంటీర్ చేతి మీదుగానే..

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకం వలంటీర్ చేతుల మీదుగానే ప్రజలకు అందుతోంది. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్ చొప్పున నియమించడంతో ఆ యాభై ఇళ్లకు సంబంధించిన పూర్తి సమాచారం ఆ వలంటీర్ వద్ద భద్రంగా ఉంటుంది. ప్రభుత్వం అందించే పథకాలకు ఎవరు అర్హులో వారికి అందజేయటంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. దీంతో ప్రజలకు ఏ అవసరం వచ్చినా మా వలంటీర్ ఉన్నాడు అనే భరోసా దొరుకుతోంది.

సచివాలయ పరిధిలోనే సేవలన్నీ..



సచివాలయ పరిధిలో అన్ని రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని సేవలు ప్రజల గడప వద్దే అందజేస్తున్నాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా సచివాలయాలు పని చేస్తున్నాయి. వలంటీర్ల ద్వారా సేవలన్నింటినీ లబ్ధిదారులకు అందిస్తున్నాం.

–త్రివేణి, వుడ్‌యార్డ్ సచివాలయం అడ్మిన్

అడగకుండానే అన్నీ..



నా ఉన్నత చదువులకు కావాల్సిన క్యాస్ట్, ఇన్‌కం సర్టిఫికెట్లు సచివాలయం ద్వారా అడగకుండానే అందజేశారు. సకాలంలో సర్టిఫికెట్లు అందజేయటం వలన అనుకున్న సమయంలోగా కాలేజీలో దరఖాస్తు చేసుకోగలిగాను. తిరగకుండానే మా పనులు పూర్తయ్యే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–సరగడ నీహారికరెడ్డి, అమ్మవారివీధి

ఈబీసీ నేస్తంతో లబ్ధి



అగ్రకులాల్లో పుట్టినప్పటికీ ఆర్థికంగా వెనుకబడి ఉన్న వాళ్లను గత ప్రభుత్వాలు గుర్తించలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈబీసీ నేస్తం ద్వారా ఆర్థిక సహకారం అందజేయటం ఆనందంగా ఉంది. అదే విధంగా ప్రభుత్వ పథకాల ద్వారా ఈబీసీ వారికి రిజర్వేషన్లు ప్రవేశపెట్టి సచివాలయాల ద్వారా సేవలందించడటం సౌలభ్యంగా ఉంది. జగనన్నకు ధన్యవాదాలు.

–సీహెచ్ కళ్యాణి, అల్లిపురం

జగనన్న విద్యా కానుకతో ఉజ్వల భవిత



అచ్చియ్యమ్మపేట పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేసిన తోట పద్మావతి

అల్లిపురం: విద్యార్థుల ఉజ్వల భవితకు జగనన్న విద్యా కానుక ఎంతో తోడ్పడుతుందని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. పిల్లలకు మేనమామగా ముఖ్యమంత్రి జగనన్న విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు పుస్తకాలు, యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ, సాక్సులు అందించారన్నారు. అచ్చియ్యమ్మపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, దూడ అప్పారావు, తాతబ్బాయి, దుర్గారావు, దేవి, వెంకటేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఎంసీలో ముగిసిన వర్క్‌షాప్



వర్కుషాప్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ (ఏఎంసీ)కి చెందిన రీజనల్ సెంటర్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (ఆర్‌సీఎంఈటీ)లో రెండు రోజుల నుంచి జరుగుతున్న వర్కుషాప్ నేటితో ముగిసింది. శనివారం వీడియో లెక్చర్ గ్యాలరీలో కరికులం ఇంప్లిమెంటేషన్ సపోర్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన వర్కుషాపును ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు ప్రారంభించారు. రాజమండ్రి నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న అనేక వైద్య కళాశాలలు, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కోల్‌కతా తదితర ప్రాంతాలకు చెందిన వైద్య కళాశాలలకు చెందిన ప్రతినిధులు పలు అంశాలపై చర్చించారు.

సీఎం జగన్‌కే యువత మద్దతు



మాట్లాడుతున్న అల్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు, స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని అల్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర పాల్గొన్నారు.

ఈఎంసీ సేవలు అభినందనీయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: ఇతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ (ఈఎంసీ) సేవలు అభినందనీయమని గ్రేహౌండ్ గ్రూప్ కమాండర్ అద్నన్ నయీమ్ అస్మీ కొనియాడారు. పేద ముస్లింలకు ఏ అవసరమైనా మేమున్నామంటూ సొసైటీ ముందుకు రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఉన్నత విద్యలో రాణిస్తూ అత్యధిక మార్కులు సాధించిన 114 మంది ముస్లిం పిల్లలకు ప్రోత్సాహకాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సొసైటీ చేస్తున్న సేవలను పేద ముస్లింలు వినియోగించుకుని విద్యలో రాణించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకుడు అమీద్ ఖాన్, ఉపాధ్యక్షుడు ఐహెచ్ ఫారూఖీ, అధ్యక్షుడు మూసమెహదీ, కార్యదర్శి రియాజ్‌ఖాన్, కోశాధికారి జఫర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కమిషనర్‌కు వినతి

దాబాగార్డెన్స్: ప్రజల సమస్యలపై తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కష్టాలు, విద్యుత్ దీపాల నిర్వహణ సరిగ్గా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారంటూ ఆ పార్టీ జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు కమిషనర్‌ను కలిసారు. బోర్లు లేక మంచినీటి ఎద్దడి ఎక్కువగా ఉందని వినతిపత్రంలో తెలిపారు. గంధం శ్రీనివాసరావు, పిల్ల మంగమ్మ, గొలగాని వీరారావు, శరగడం రాజశేఖర్, గల్లా చిన్న, పల్లా శ్రీనివాసరావు, పులి లక్ష్మీబాయి, దాడి రమేష్, పీవీ నరసింహం, బొమ్మిడి రమణ తదితరులు కమిషనర్‌ను కలిశారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి జరుగునని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు WWW.OAMDC.AP.GOV.IN పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7780168423, నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



మాజీ చైర్మన్ కుమార్‌రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పత్తులను తిలకించేందుకు శనివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు. ఈ ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట : ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ సలే అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్‌పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సీతమ్మధార: డిగ్రీ కళాశాలలకు ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియ తొలగించి, నేరుగా అడ్మిషన్లు చేసుకునే విధంగా ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కనుమర్ల గుండారెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అద్దె భవనాల్లో నడుపుతున్న డిగ్రీ కళాశాలలకు 33 ఏళ్ల లీజు అవకాశం కల్పించాలని, మూడేళ్ల అఫిలియేషన్ అందించాలన్నారు. రాష్ట్రంలో అన్ని యూనివర్సిటీల్లో ఒకే రకమైన అఫిలియేషన్ ఫీజులు, రిజిస్ట్రేషన్ ఫీజులు ఉండేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆదివారం జరిగే ఆత్మీయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. గౌరవాధ్యక్షులు చింత విజయ్ భాస్కర్‌రెడ్డి, టి.బాలరామకృష్ణ, జనరల్ సెక్రటరీ జెర్రిపోతు రమణాజీ, ఫైనాన్స్ సెక్రటరీ గుర్రాల వెంకటరెడ్డి, ఏయూ వైస్ ప్రెసిడెంట్ చల్లా రామకృష్ణప్రసాద్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ పొన్నాన జయరాం పాల్గొన్నారు.

నేడు మాస్టర్‌మైండ్స్ ప్రతిభా పురస్కారాలు

దాబాగార్డెన్స్: ఈ ఏడాది ఏప్రిల్ (26)లో ప్రకటించిన సీనియర్ ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో స్టేట్/సీబీఎస్‌ఈ సిలబస్‌లో 950 ఆపై మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రముఖ మాస్టర్‌మైండ్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించనునందని అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వీఐపీ రోడ్డు, షాపర్ స్టాప్ వెనుక, సీబీఎం కాంపౌండ్‌లో గల మాస్టర్‌మైండ్స్ క్యాంపస్‌లో 'ప్రతిభ పురస్కారాలు' పేరిట ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. విద్యార్థులు గుర్తింపు కార్డు (ఆధార్ కార్డు/కళాశాల జారీ చేసిన గుర్తింపు కార్డు), సీనియర్ ఇంటర్ పరీక్షలో సాధించిన మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ) తీసుకుని రావలని తెలిపారు. విద్యార్థులు 9248733302, 9989893943 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ప్రతిభ పురస్కారాల కింద సర్టిఫికెట్‌తో పాటు నగదు ప్రోత్సాహకాలు అందజేయనున్నట్టు అంజిరెడ్డి చెప్పారు.

పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యం



విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న అతిథులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు ముఖ్య అతిథి స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిల్లల చదువుకు అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల కంటే మెరుగ్గా తీర్చిదిద్ది, ఇంగ్లిష్ మీడియం బోధన అందుబాటులోకి తెచ్చారన్నారు. సీబీఎస్‌ఈ విద్యా విధానం, పిల్లలకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్స్ ఇచ్చారని తెలిపారు. రుచి గల పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంగా పిల్లలకు అందిస్తున్నారని చెప్పారు. పాఠశాలలు ప్రారంభించిన రోజు నుంచే 9 రకాల వస్తువులతో కూడిన జేవీకే కిట్లు అందజేయడం చూస్తుంటే సీఎం వైఎస్ జగన్ విద్యా రంగంపై చూపిస్తున్న శ్రద్ధ తెలుస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతంగా ఎదగాలని కార్పొరేటర్ గోవింద్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సరోజిని, ఉపాధ్యాయులు శారద, అరుణ, ఎడ్యుకేషన్ సెక్రటరీ వినోద్, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వార్డు నాయకులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు.

పర్యావరణ హిత విశాఖకు కృషి



ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: దేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ లైఫ్, విశాఖలో అమలు చేస్తున్న ఎకో వైజాగ్ కార్యక్రమాలను జయప్రదం చేద్దామని, పర్యావరణ హిత విశాఖకు పాటుపడదామని ఎస్‌ఎంసీ హెచ్ స్కూల్ ఉపాధ్యాయిని ఆర్.జి.ప్రభావతి పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో శనివారం పీ అండ్ టీ కాలనీలోని ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఎడారీకరణ, కరువును ఎదుర్కొనే దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ దినోత్సవాన్ని ఏటా ఐక్య రాజ్య సమితి నిర్వహిస్తోందన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ మన భూగోళాన్ని సమస్త జీవరాశితో కళకళలాడేలా చూద్దామని ఆకాంక్షించారు. ప్రాణవాయువును 21 శాతం నుంచి 23.5 శాతానికి పెంచుకుందామన్నారు. అనంతరం విద్యార్థులు ఎకో వైజాగ్ ప్లకార్డులు ప్రదర్శించారు.

సమస్యల పరిష్కారం దిశగా 'గ్రీవెన్స్'

సీతమ్మధార: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా గ్రీవెన్స్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయనకు పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని తక్షణం పరిష్కరించారు. మిగిలిన అర్జీలను అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, 14వ వార్డు కార్పొరేటర్ కతారి అనిల్‌కుమార్‌రాజు, ఉషశ్రీ, కిరణ్‌రాజు, వార్డు అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.